క్లుప్తంగా

హుజూరాబాద్ ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే పోటీ చేస్తా



మాట్లాడుతున్న పొనగంటి మల్లయ్య

జమ్మికుంట: హుజూరాబాద్ ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ టికెట్ ఇస్తే పోటీ చేస్తానని, సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌లకు విజ్ఞప్తి చేస్తున్నానని పార్టీ సీనియర్ నాయకుడు, జమ్మికుంట మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని స్వగృహంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలతో మంచి సంబంధాలున్నాయని, పట్టణంలోని 15 కుల, వృత్తి సంఘాలకు గౌరవ అధ్యక్షుడిగా, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడిగా పని చేస్తున్నానని వివరించారు. బీఆర్ఎస్ మద్దతుతో కాంగ్రెస్, బీజేపీని ఓడిస్తానని, పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, క్రియాశీల రాజకీయ విషయం పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో మార్కెట్ మాజీ చైర్ పర్సన్ పొనగంటి శారద, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, పట్టణ బీఆర్ఎస్, మున్నూరు కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

‘బకాయిలు చెల్లించకపోతే ఆందోళనలు’



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేణు

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేచవేణి వేణు అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని, ఎంతోమంది పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక సకాలంలో సర్టిఫికెట్స్ అందక ఉన్నత విద్యకు దూరమవుతున్నా పట్టించుకోకపోవటం దుర్మార్గమన్నారు. బకాయిలను సకాలంలో చెల్లించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర సంయుక్త కార్యదర్శి సచిన్, అజయ్, నగేష్, రాజు, విజయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ భూంరెడ్డి

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు సర్పంచ్, పాలకవర్గం సభ్యులు శంకుస్థాపన చేశారు. అంబేడ్కర్ సంఘం కమ్యూనిటీ హాల్ నుంచి కొంకట రాజయ్య ఇంటి వరకు సైడ్‌కాలువ నిర్మాణం, కూతాటి ఎల్లయ్య ఇంటి వద్ద హైమాస్ట్ లైట్ ఏర్పాటు, జెడ్పీపాఠశాలలో మరమ్మతులు, తాగునీటి వసతి, చట్ల రాజయ్య ఇంటి నుంచి దరిపెల్లి బాలయ్య ఇంటి వరకు మురుగుకాల్వ నిర్మాణ పనులను సర్పంచ్ కానుగంటి భూంరెడ్డి, ఉపసర్పంచ్ పెండ్యాల శారదసదానందం, ఎంపీటీసీ మిట్టపెల్లి మల్లేశం పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు విజ్జగిరి, మేడుదుల కొంరయ్య, పెండెల ప్రభగురువయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జమ్మికుంట ఎక్సైజ్ పరిధిలో 2023–25 సంవత్సరానికి సంబంధించి మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్ విడుదలైందని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని జమ్మికుంట ఎక్సైజ్ సీఐ ఎండీ అక్బర్‌హుస్సేన్ అన్నారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మాట్లాడారు. జమ్మికుంట సర్కిల్ పరిధిలో 16 ,జమ్మికుంట 8, మండలంలోని నాగంపేట 1, వావిలాల 1, వీణవంక మండలంలో నాలుగు కేటాయించగా వీణవంక మండల కేంద్రంలో 2, చల్లూరులో 2 , ఇల్లందకుంట మండల కేంద్రానికి 2 కేటాయించినట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరి 9, ఎస్సీ 4, గౌడకులస్తులకు 3 రిజర్వేషన్ కల్పించనున్నామని, దరఖాస్తు చేసుకునేవారు ఒక్కో దుకాణానికి జిల్లా ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ పేరు మీద రూ. రెండు లక్షల డీడీతో ఈ నెల 18వ తేదీలోపు కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఫారంతో జతపరిచి సమర్పించాలన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా డీడీలు చెల్లించవచ్చని, టెండర్లు ఆగస్టు 21వ తేదీన కలెక్టర్ ఆడిటోరియంలో ఓపెన్ చేస్తామని, దుకాణాలు పొందిన వారు 22వ తేదీన మొదటి వాయిదా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సందేహాలు, సమాచారం కోసం 8712658812 నంబరు సంప్రదించాలని పేర్కొన్నారు.

కొత్తది నిర్మించేదాక తిప్పలే..!



శిథిలావస్థకు చేరిన పాఠశాల



గ్రామ పంచాయతీ వరండాపై ప్రాథమిక పాఠశాల పిల్లల చదువులు, అంగన్‌వాడీ సెంటర్

- శిథిలావస్థలో శంషాబాద్ పాఠశాల
- వర్షాలకు ఉరుస్తుండటంతో చదువులకు ఆటంకం
- జీపీ కార్యాలయ వరండాపై కొనసాగుతున్న చదువులు
- ఇబ్బందులుపడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- తాత్కాలిక మరమ్మతులతో పొంచిఉన్న ప్రమాదం


మానకొండూర్: మండలంలోని శంషాబాద్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాలకు ఉరుస్తుండటంతో తరగతి గదులు తడిసి విద్యాబోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టీచర్లు వర్షం పడిన ప్రతిసారి సమీప గ్రామ పంచాయతీ భవనంలోని వరండాపై విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల మరో గదిలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం పిల్లలను సైతం జీపీ వరండాలోనే మరో పక్క కూర్చోబెడుతున్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థుల ఇబ్బందులు

గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ముప్పై ఏళ్ల కిందట నిర్మించారని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ భవనంలోనే ప్రాథమిక పాఠశాల విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తుండగా, అంగన్‌వాడీ కేంద్రం సైతం కొనసాగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు భవనం పైకప్పు ఉరుస్తుంది, గదులు నీటితో తడిసి ముద్దవుతున్నాయి. పక్కన గుట్ట ఉండటంతో జాలు కూడ ఎక్కువగా ఉంది. ఉరుస్తున్న భవనంతో విద్యార్థులకు ప్రమాదం ఉందని ఉపాధ్యాయులు గ్రహించి జీపీ భవనంలోని వరండాపై కూర్చోబెట్టి చదువులు కొనసాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలో వరండాపై విద్యార్థుల చదువు కొనసాగుతుండటంతో ఇటు పంచాయతీ పాలకవర్గం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పంచాయతీరాజ్ అధికారులు వెంటనే పాఠశాలను పరిశీలించాలి. భవనం ఉరవకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. మండల పరిషత్ నిధులు వెచ్చించే ఆలోచనలో ఉన్న ట్లు తెలుస్తోంది. దీంతో పనులు చేపట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే పాఠశాల మరమ్మతులు త్వరగా చేపడితే విద్యార్థుల ఇక్కట్లు తొలగనున్నాయి.


సమాచారం

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు



గన్నేరువరం: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నామని ఏఈ ఆంజనేయులు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లోవోల్టేజీ, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలున్న మీటర్లు మార్చుకోవడం, నూతన సర్వీసులు మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు మొదలగు వాటిపై వినియోగదారులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గుండ్లపల్లిలో బహిరంగ సభ



గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు డబుల్ రహదారి నిర్మాణం శంకుస్థాపనలో భాగంగా గుండ్లపల్లి స్టేజీ వద్ద మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నామని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్నలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామసభను బహిష్కరించిన పాలకవర్గం



నిరసన తెలుపుతున్న జీపీ పాలకవర్గం సభ్యులు

శంకరపట్నం: మండలంలోని కరీంపేట గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు సోమవారం గ్రామసభను బహిష్కరించారు. గ్రామ పంచాయతీలో నిధులు జమ అయినా అధికారులు బిల్లులు ఇవ్వడం లేదని కేంద్రర నిధులు గ్రామ పంచాయితీలో జమ అవుతున్నాయని సర్పంచ్ వనపర్తి మల్లయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు జమ చేయకపోవడంతో రెండుళ్లగా చేసిన పనులకు బిల్లులు రావడంలేదన్నారు. సుమారు రూ.2.60 లక్షలు జమ అయినా డిజిటల్‌కీ అధికారుల వద్ద ఉందని ఆరోపించారు. మంచినీటి సరాఫరా చేసే మోటార్ కాలిపోయిందని, అధికారులు బిల్లులు ఇవ్వకపోవడంతో పది నెలలుగా వీధిలైట్లు వేయడం లేదన్నారు. జీపీ ట్రాక్టర్ డీజిల్‌కు జేబుల నుంచి డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. గ్రామ పంచాయతీ బిల్లులు అధికారులు ఎంత డ్రా చేశారో లెక్క తేలడం లేదని, చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, ఉపసర్పంచ్ కుమార్, వార్డు సభ్యులు రాజేశం , స్వరూప , రాజమల్లు, ప్రసాద్, సల్మా ఉన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన గ్రామ పంచాయతీ కార్మికులు, సీపీఐ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి సీఐటీయూ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకుడు కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. న్యాయమైన హామీలను పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. నెలరోజులకుపైగా ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కదిరే రమేష్, అజ్జు, తూముల కుమారస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



మొక్కలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఇల్లందకుంట: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని, తెలంగాణ ఉద్యానశాఖ రాయితీ పొందవచ్చని మండల ఏఈవో తిరుపతి పేర్కొన్నారు. ఎకరాకు 57 మొక్కలు అవసరమని, నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చులతోపాటు అంతర పంటలకు నగదుసాయం అందిస్తుందన్నారు. డ్రిప్ సేద్యంకు 80 నుంచి 100 శాతం కేటగిరీని అనుసరించి రాయితీ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తి గల రైతులు ఆధార్, బ్యాంకు, పట్టాదారు పాసుపుస్తకం, 1–బీ జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఉద్యానశాఖ అధికారి మంజువాణి 7997725047, ఫీల్డ్ అధికారి వేణు 9154177762 నంబర్లను సంప్రదించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు జనవరి నుంచి మొక్కలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

తిమ్మాపూర్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల సేవా ట్రస్ట్ చైర్మన్ ఏకానందం జన్మదినం పురస్కరించుకొని ఉల్లెంగుల నవీన్ ఆధ్వర్యంలో మండలంలోని మహాత్మానగర్ రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతి రెడ్డి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... సేవా ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పాఠశాలలో బెంచీలు, పుస్తకాలు, నోట్‌బుక్స్, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం అనిల్ గౌడ్, పాశం అశోక్ రెడ్డి గంగరాజు మాతంగి లక్ష్మణ్ శివ అంజిరెడ్డి ప్రసాద్ శ్రీనివాస్ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామడుగులో క్రికెట్ టోర్నమెంట్



మాట్లాడుతున్న ఎస్సై తోట తిరుపతి

రామడుగు: క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని రామడుగు ఎస్సై తోట తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సీజన్–1 ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కాగా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులు అన్ని క్రీడల్లో రాణించాలని, గెలుపు, ఓటమిని గొప్ప అనుభూతిగా తీసుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బందులకు లోనుకావొద్దని సూచించారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండ అజయ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్ రెడ్డి, రామడుగు సర్పంచ్ పంజాల ప్రమీల, మాజీ సర్పంచులు పంజాల జగన్‌మోహన్‌గౌడ్, చాడ శేఖర్‌రెడ్డి నిర్వాహకులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్సై కొలువులు సాధించిన రైతుబిడ్డలు

మానకొండూర్/మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ గ్రామం నుంచి ముగ్గురు, రంగపేట గ్రామం నుంచి ఒకరు లక్ష్యం కోసం కష్టపడి ఎస్సై కొలువులు సాధించారు. రంగపేట గ్రామానికి చెందిన కొత్త సత్యనారాయణ రెడ్డి కూతురు వినితరెడ్డి సివిల్ ఎస్సైగా ఎంపికయ్యారు. పచ్చునూర్ గ్రామానికి చెందిన మొగిలి అన్వేశ్, నర్మెట నరేందర్, కసిరెడ్డి రాజేందర్‌రెడ్డిలక్ష్మి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఎస్సైలుగా ఎంపికయ్యారు. అందరూ వ్యవసాయ కుటుంబాలకు చెందినవారే. ఆయా గ్రామాలకు చెందిన యువత ఎస్సై ఉద్యోగాలకు ఎన్నికైనందున ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

చొప్పదండి: పట్టణంలోని మూడోవార్డుకు చెందిన ఎముండ్ల సమత ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైంది. వ్యవసాయం చేసుకొని జీవించే బీరయ్య కూతురు సమత తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్ఐగా ఎంపికైంది. కౌన్సిలర్ మహేశుని సంధ్య, చొప్పదండి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం సమతను అభినందించారు.

భూ పరిశీలన

తిమ్మాపూర్: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బొమ్మలకుంటకు వెళ్లే రోడ్డును స్థానికులు ఇరువైపులా ఆక్రమించుకున్నారని, 25 ఫీట్ల రోడ్డును 12 ఫీట్ల వరకు తీసుకొచ్చారని గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే కలెక్టర్ సమస్య పరిష్కరించాలని తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయనికి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఎంపీవో కిరణ్ రోడ్డును పరిశీలించి, గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

వైద్యశిబిరాలు

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ లో సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. వైద్య సిబ్బంది గ్రామస్తులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, డాక్టర్ సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీనరసింహ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు వందమందికి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాలవికాస సంస్థ కోఆర్డినేటర్ ఖాజాబీ, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, వార్డు మెంబర్ కవిత తదితరులు ఉన్నారు.

కాసారంలో పశువైద్య శిబిరం

గంగాధర: మండలంలోని కాసారం గ్రామంలో సోమవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని సర్పంచ్ వేముల దామోదర్ ప్రారంభించారు. ఈసందర్భంగా సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ప్రతి గ్రామంలో శిబిరాలు నిర్వహించి టీకాలు వేస్తామని పశువైద్యాధికారి దినేశ్‌రెడ్డి పేర్కొన్నారు.

ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా భీమన్న



భీమన్నను నియమిస్తున్న జిల్లా అధ్యక్షుడు మల్లేశం

శంకరపట్నం: ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శిగా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన నూనె కనకరాజు అలియాస్ భీమన్న నియామకమయ్యారు. ముదిరాజ్‌ల హక్కుల కోసం భీమన్న నిరంతరం పోరాటం చేస్తున్నారని జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం తెలిపారు. నియామకానికి సహకరించిన మండల అధ్యక్షుడు భిక్షపతి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, గౌరవ అధ్యక్షుడు నరసయ్య, జెడ్పీటీసీ రవీందర్, యూత్ అధ్యక్షుడు పండుగ బాలు, రవీందర్, రాజుకు భీమన్న కృతజ్ఞతలు చెప్పారు.

ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని, ఆరునెలల వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ తెలిపారు. సోమవారం చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రవీందర్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తుందన్నారు. సమతుల ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన బిడ్డలు జన్మిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ధర్మానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ, ఇందిర, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

హుజూరాబాద్: హుజూరాబాద్ ఆర్డీవోగా ఎస్. రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో భూ సమస్యల పరిష్కారం కోసం దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

మానకొండూర్‌రూరల్ తహసీల్దార్‌గా..

మానకొండూర్‌రూరల్: మండల తహసీల్దార్‌గా సీహెచ్. రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మారెడ్డి ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా డీటీ నవాజ్, ఆర్ఐ విజయలక్ష్మి, సత్యనారాయణ, సమీనా, సిబ్బంది రజని, వీఆర్ఏలు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఆర్డీవోను కలిసిన తహసీల్దార్

ఇల్లందకుంట: హుజూరాబాద్ ఆర్డీవోగా ఎస్. రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇల్లందకుంట తహసీల్దార్ గట్ల రమేశ్‌బాబు ఆర్‌డీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

గద్దర్‌కు నివాళి

చిగురుమామిడి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. సమాజాన్ని పాటల ద్వారా ఉత్తేజపరిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి రవీందర్, అధికార ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి నరేశ్, నాయకులు ఉన్నారు.

జమ్మికుంట: మండలంలోని సైదాబాద్‌లో సర్పంచ్ పుప్పాల శైలజరాజారామ్ ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరాం శ్యామ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అరవింద్, క్రాంతి, మధు, నరేష్, రవి, రాములు, ప్రశాంత్, శ్రీకాంత్, సాయికుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నంలో ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అభిలాశ్, ఆరీఫ్, సంపత్, సదానందం, శరత్, వీరస్వామి, శ్రావణ్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

సైదాపూర్: మండలంలోని కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సైదాపూర్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రాఘవులు, కిష్టయ్య,కొండాల్‌రెడ్డి, మల్లయ్య, చాంద్ పాషా, రవీందర్,తిరుపతి,వెంకటేశం, మాజీ ఎంపీపీ వెంకట్రాజం, అశోక్, కుమార్‌రాజా, తదితరులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు అడ్డగింత

గన్నేరువరం: డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించకుంటే ఇంటి సమీపంలోని శ్మశానవాటికను తొలగించాలని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకుడు కట్ట కొమురయ్య డిమాండ్ చేశారు. పారువెల్ల గ్రామంలోని చెరువు వద్ద సీసీ రోడ్డు పనులను అడ్డుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. చెరువు కట్ట వద్ద ఇళ్లు ఉందని, రెండేళ్ల క్రితం శ్మశాన వాటిక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సమయంలో కుటుంబసభ్యులతో అడ్డుకోగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో నాలుగు గుంటల భూమిని కేటాయించారని తెలిపారు. కానీ ఇంతవరకు పట్టా కాలేదని, కేవలం రెండు గుంటల భూమి మాత్రమే ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. సీసీరోడ్డు నిర్మాణంతో నీటి మట్టం పెరిగి ఇంటిలోకి నీరు వచ్చే అవకాశం ఉందని, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సర్పంచ్ తీగల మోహన్‌రెడ్డి స్పందించి, కేటాయించిన స్థలంలో డబుల్ బెడ్‌రూం ఇలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులను అడ్డుకోద్దని న్యాయం చేస్తామని సహకార సంఘం మాజీ చైర్మన్ అలువాల కోటి హామీ ఇచ్చిన ససేమేరా అన్నారు. ఈ క్రమంలో ఎస్సై చందా నరసింహారావు సంఘటన స్థలానికి చేరుకొని కొమురయ్యను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం వదిలిపెట్టారు.

జాతీయ చేనేత దినోత్సవం

చొప్పదండి: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నేతన్న విగ్రహం వద్ద పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దండె రాజయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో జిల్లా పద్మశాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. చేనేత కార్మికుడు అడిగొప్పుల స్వామిని నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం చేనేత బంధు పథకం అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత అలువాల విష్ణు, నాయకులు బుదారపు కార్తీక్, నర్సయ్య, ప్రవీణ్, తిరుపతి, పలువురు పాల్గొన్నారు.

మరమగ్గాల సందర్శన

మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు జాతీయ చేనేత దినోత్సవం పురష్కరించుకొని పెగడపల్లి మండలం మ్యాకవెంకయ్యపల్లిలోని మరమగ్గాల పరిశ్రమను సందర్శించారు. మరమగ్గాలతో వస్త్రాలను నేసే విధానం అక్కడి కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.